క్లుప్తంగా

దశ భుజ మహా గణపతికి పూజలు



రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో ఉన్న దశభుజ మహాగణపతి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

బాబా ఫక్రుద్దీన్ జెండా ఊరేగింపు



పెనుకొండ బాబా ఫక్రుద్దీన్ జెండా ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పెనుకొండ హజరత్ బాబా ఫక్రుద్దీన్ ఉరుసును పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పాత బజారులో ఉన్న పెనుకొండ బాబా ఫక్రుద్దీన్ జెండా కట్ట వద్ద ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా కట్టను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించిన జెండాను పట్టణంలో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఉత్తర గాలిగోపురానికి ముఖ ద్వారం ఏర్పాటు



ముఖ ద్వారం ఏర్పాటు చేసిన దృశ్యం

కూడేరు: మండల కేంద్రంలో ప్రఖ్యాతిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రానికి బళ్లారికి చెందిన భక్తుడు బసన్న గౌడ్ సుమారు రూ.80 లక్షలతో ఉత్తర, దక్షిణ గాలిగోపురాలను నిర్మిస్తున్నారు. ఆదివారం ఉత్తర గాలి గోపురానికి ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. గోపురాల నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరగా గోపురాల నిర్మాణపు పనులు పూర్తి చేసి జోడు లింగాల ఆలయానికి నూతన శోభను తీసుకు రావాలన్నదే తన కోరిక అని నిర్మాణ కర్త బసన్న గౌడ్ తెలిపారు. నిర్మాణపు పనులు సజావుగా సాగేందుకు ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ అధికారులు, భక్తులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

పింఛన్‌దారుల సంబరాలు



రాకెట్లలో కేక్ కట్ చేస్తున్న పింఛన్‌దారులు

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల గ్రామంలో పింఛన్‌దారులు సంబరాలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర కానుకగా పింఛన్‌ను రూ.3 వేలకు పెంచడాన్ని హర్షిస్తూ ఆదివారం రాకెట్లలోని ఎస్సీ, బీసీ కాలనీల్లోని ఫింఛన్‌దారులు వలంటీరు సూర్యనారాయణ ఆఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు చేపట్టారు. మా బిడ్డ జగన్ రూ.3 వేలకు పింఛన్ పెంచి మాకు ఆర్థిక భరోసా కల్పించాడని పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేస్తు సంబరాలు చేసుకున్నారు.అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు అండగా ఉంటామన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామానికి చెందిన చిన్న తిప్పేస్వామి నుంచి 50 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సునీత తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి విక్రయిస్తున్నాడని సమాచారం అందడంతో ఇంట్లో సోదా చేయగా 50 టెట్రా ప్యాకెట్లు లభించాయన్నారు. నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

ప్రకృతి నడకతో ఆరోగ్యం



మొక్కల మధ్య వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

కుందుర్పి: ప్రకృతి నడక విద్యార్థుల ఆరోగ్యానికి దోహద పడుతోందని ఎస్కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు సూచించారు. ఆదివారం కుందుర్పిలో విలువల బడి విద్యార్థులతో ప్రకృతి నడక చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణ పరిరక్షణ, మొక్కల ప్రాధాన్యత, వ్యాయామం వల్ల చేకూరే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. గ్రామ సమీపంలోని తోటలోని తీసుకెళ్లి విద్యార్థులో వ్యాయామం చేయించారు. కార్యక్రమంలో విలువల బడుల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త సంవత్సరానికి స్వాగతం

- అర్ధరాత్రి దాటగానే యువత సంబరాలు
- నేతలకు శుభాకాంక్షల వెల్లువ



రాయదుర్గంలో బేకరీ వద్ద కేక్ కొనుగోళ్లతో యువత సందడి



కంబదూరులో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న మహిళలు

రాయదుర్గం: ఎన్నో ఆటుపోట్లు, కష్టసుఖాల మధ్య ఏడాది కాలం క్షణాల్లో కరిగిపోయింది. 2023 కనుమరుగై 2024 వచ్చేసింది. కొత్త సంవత్సరానికి సరికొత్తగా ప్లాన్ చేసేందుకు విద్యార్థులు, యువత, రాజకీయనాయకులు సిద్ధమయ్యారు. గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా ప్రణాళికలు తయారు చేసుకున్నారు. యువత విందులు, వినోదాల మధ్య నూతన సంవత్సరంలో అడుగు పెట్టారు. సోషల్ మాధ్యమాల్లోనూ వెల్లువలా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వానికి అంతా మంచి జరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ ఫ్లెక్సీలు, హోర్డింగులు కట్టారు. బేకరీల వద్ద కేక్‌లు, స్వీట్ల దుకాణాల వద్ద మిఠాయిల కొనుగోలుకు క్యూ కట్టారు.

రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద నేడు వేడుకలు

పట్టణంలోని స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్త మధ్య కేక్ కట్ చేసి కొత్త సంవత్సరం సంభరాలు జరుపుతామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. వేడుకల్లో అధికారులు, అనధికారులు, యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. అలాగే ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

న్యూ ఇయర్ సందడి

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఆదివారం న్యూ ఇయర్ సందడి నెలకొంది. చిన్నారులు మొదలకుని పెద్దలు, యువకులు కేక్‌లు కొనుగోళ్లు, దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు ఆసక్తి చూపారు. దీంతో లక్ష్మీబజార్ నుంచి పాత బస్టాండ్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్లలో వ్యాపార దుకాణాలు కిటకిటలాడాయి. మరో వైపు న్యూ ఇయర్ వేడుకలను నిబంధనలకు మేరకు జరుపుకోవాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో సన్నిహితులు, కుటుంబ సభ్యులతో కలసి వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

కంబదూరు: నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని సీఆండ్ఐజీ మిషన్ చర్చి ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు.ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన కబడ్డీ, మ్యూజిల్ చైర్స్, తదితర పోటీల్లో మహిళలు, యువతీ యువకులకు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ జేమ్స్, సంఘ పెద్దలు దినకర్, జాన్ శాస్త్రి, ప్రభుదాసు,ఎస్.పాల్, విజయ్‌కుమార్, జకరయ్య, జాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



కాపు రామచంద్రారెడ్డి, శివరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి

రాయదుర్గం: ప్రజలందరికీ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 లో ప్రతి ఇంటా ఆనందాలు, ప్రతి కుటుంబంలో సుఖ, సంతోషాలు, అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తనకు శుభాకాంక్షలు తెలిపే వారు బొకేలు, శాలువాలు కాకుండా నోట్‌పుస్తకాలు, పెన్నులు, పూలమొక్కలు తీసుకురావాలన్నారు. అలాగే ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు పూలు, శాలువాలు తీసుకురావొద్దన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో మెలగాలి

ఉరవకొండ: 2024 నూతన సంవత్సరంలో ఉరవకొండ నియోజకవర్గ ప్రజలకు అంతా మంచే జరగాలని, సుఖసంతోషాలతో మెలగాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. ఈ మేరకు వారు ఆదివారం వేర్వేరు ప్రకటనల ద్వారా నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ప్రమాణ స్వీకారం చేయాలని వారు ఆకాంక్షించారు.

బస్సుయాత్ర జయప్రదం చేయండి



ఉరవకొండ క్లాక్ టవర్ వద్ద బస్సుయాత్ర సభా స్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: పట్టణంలోని క్లాక్‌టవర్ ప్రాంతంలో జనవరి 7న మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్‌సీపీ చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆదివారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. బస్సుయాత్ర జరిగే రూట్, సభావేదిక స్థలం కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా రెండు, మూడు అనువైన స్థలాలను చూసి, వేదిక ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. బస్సు యాత్రలో పాల్గొనే ప్రజానీకానికి అన్ని సౌకర్యాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సుయాత్రకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ప్రజలే స్వచ్ఛందంగా తరలివచ్చి యాత్ర జయప్రదం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పార్టీ పట్టణ, మండల సమన్వయకర్తలు ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, ఉపసర్పంచ్ వన్నప్ప, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



ఒకటో వార్డులో ప్రారంభమైన సీసీ రోడ్డు పనులు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ఒకటో వార్డులో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే,ని యో జకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలనీలో ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు సీసీ రోడ్లు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే స్పందించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులకు సూచించారు. విశ్వ చొరవతో ఉపాధి పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి పనులు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ సుశీలారాణి, సర్పంచు మోనాలిసా, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎద్దాటి రమేష్, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, పీఆర్ జేఈ మణిభూషన్ తదితరులు పనులను పర్యవేక్షించారు. పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మానిటరింగ్ సభ్యుడికి సన్మానం

ఉరవకొండ: స్థానిక 3వ వార్డు మాలవీధిలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన అనంతపురానికి చెందిన రామన్నను ఆదివారం ఘనంగా సన్మానించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తమ్మన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ యువజన విభాగం సభ్యులు కృష్ణ, మోహన్, తేజ, చాముండి, హరికిషోర్, అజిత్, భవానీ తదితరులు అతడిని సత్కరించారు. రామన్న మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు.

అర్చక సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అర్చక సమాఖ్య ప్రతినిధులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోట ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా మల్లాపురంలోని విప్రమలై లక్ష్మీ నవనరసింహస్వామి ఆలయ ప్రధాన స్థాపకుడు రామమూర్తి స్వామిజీ హాజరయ్యారు. కార్యక్రమంలో రెండు జిల్లాల అర్చక సమాఖ్య కార్యవర్గ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

రోడ్లపైకి వచ్చి చిందులేస్తే చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది

కూడేరు: నూతన సంవత్సరం వేడుకల పేరిట మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి చిందులేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ ఆయన సిబ్బందితో కలిసి కూడేరు, జల్లిపల్లి, ముద్దలాపురం, కమ్మూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. న్యూ ఇయర్‌ను ఇళ్లలో సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. మద్యం సేవించి బైక్‌లకు సైలెన్సర్లు తీసేసి పెద్దపెద్ద శబ్దాలతో రోడ్లపై తిరుగుతూ జన జీవనానికి ఇబ్బంది కల్గిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపొద్దని వాహనదారులకు సూచించారు.

హోరాహోరీగా ఆర్‌వైఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీ





రాయదుర్గం: కప్ చూపుతున్న కాశీపురం జట్టు, కణేకల్లు: బహుమతి అందుకుంటున్న యర్రగుంట జట్టు

రాయదుర్గం రూరల్/కణేకల్లు: నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తనయుడు కాపు ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆర్‌వైఎస్‌ఎల్ (రాయదుర్గం యూత్ స్పోర్ట్స్ లీగ్) నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. రాయదుర్గం మండలంలోని కాశీపురం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల మైదానంలో ఆదివారం మండలస్థాయి ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెంచానపల్లి జట్టుపై కాశీపురం జట్టు విజయం సాధించింది. కాశీపురం జట్టు కెప్టెన్ రవికుమార్‌కు ఉపసర్పంచ్ శేఖర్‌రూ.10 వేలు, విన్నర్ కప్ అందజేశారు. రన్నర్స్ జట్టు కెప్టెన్ భరత్‌కు రూ.5 వేలు, కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, వేపరాల రహిమాన్, కెంచానపల్లి బుజ్జి, కాశీపురం తిమ్మప్ప, ఆర్గనైజర్లు ఉడేగోళం అమరేష్ , పృథ్వీరాణా, తిప్పేస్వామి, అశ్వర్థకుమార్ , శ్రీనివాసులు, దేవరాజ్ పాల్గొన్నారు. అలాగే కణేకల్లు జెడ్పీహైస్కూల్ క్రీడామైదానంలో ఆదివారం జరిగిన ఆర్‌వైఎస్‌ఎల్ ఫైనల్ మ్యాచ్‌లో కణేకల్లు ఆర్డీటీ ఏ–జట్టుపై యర్రగుంట హనుమాన్ జట్టు విజయం సాధించింది. విన్నర్ యర్రగుంట జట్టుకు కాపు ప్రవీణ్‌రెడ్డి సమకూర్చిన రూ.10 వేల నగదు, కప్పు, రన్నర్స్ జట్టుకు రూ.5 వేల నగదు, కప్పును జెడ్పీటీసీ డి.పద్మావతి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ కేశవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు బోయ రమేష్, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, నాయకులు కెనిగుంట రామిరెడ్డి, జక్కలవడికి హనుమంతరెడ్డి, హంపీ, చిన్న సర్మస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంటలో కనకదాస జయంతి



జ్యోతులు మోస్తున్న మహిళలు

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఆదివారం భక్త కనకదాస జయంతిని కురుబ కులస్తులు ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో అలంకరించి బోనాలతో ఊరేగించారు. అనంతరం కనకదాస జీవిత చరిత్ర, కురుబల హక్కుల సాధనకు చేపట్టాల్సిన చర్యలపై ఆ సంఘం నాయకులు వివరించారు. కార్యక్రమంలో అల్లాపురం, ఎర్రగుంట గ్రామాలకు చెందిన కురుబ కులస్తులు పాల్గొన్నారు.

19 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

బొమ్మనహాళ్: మండలంలో జనవరి 19 నుంచి నిర్వహించనున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ షకీలాబేగం సూచించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జనవరి 19న బండూరు, 23న దర్గాహొన్నూరు–1, 30న లింగదహాళ్, ఫిబ్రవరి 13న దర్గాహొన్నూరు–2, ఫిబ్రవరి 23న ఏలంజి, ఫిబ్రవరి 27న కురువళ్లి, మార్చి 15న నేమకల్లు, మార్చి 22న గోనేహాళ్, మార్చి 26న గోవిందవాడ–1, ఏప్రిల్ 16న గోవిందవాడ–2, మే 10న ఉంతకల్లు, మే 21న బొల్లనగుడ్డం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన వైద్య బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం



స్వామిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

కుందుర్పి: మండలంలోని నిజవళ్లిలో చిత్రలింగేశ్వరస్వామి,ఈరన్న స్వామి గ్రామోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. సోమవారం బెస్తరపల్లిలో బొమ్మలింగేశ్వర స్వామి ఉత్సవం నిర్వహించనున్న తరుణంలో యాదవులు నిజవళ్లి గ్రామం నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని బొమ్మలింగేశ్వరస్వామి ఆలయం వరకూ గ్రామోత్సవంగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటంపల్లి, నిజవళ్లి, జంబుగుంపల, బెస్తరపల్లి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ ఇమాంషావలి ఉరుసు



చిన్నారికి తులాభారం వేస్తున్న దృశ్యం



దర్గాలో ఫాతేహాలు చేయిస్తున్న భక్తులు



విద్యుత్ కాంతులతో ఇమాంషావలి దర్గా



అలంకరణలో హజరత్ ఇమాంషావలి సమాధి

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో హజరత్ ఇమాంషావలి ఉరుసు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా జరుపుకునే ఉరుసుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో దర్గా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులు తమ ఆరాధ్యదైవమైన హజరత్ ఇమాంషావలికి చక్కెరను తులాభారమివ్వగా.. మరికొందరు పూలచద్దర్‌ను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు అనంతపురం యూనుస్, మాబుపీరా, గంగలాపురం ఫక్రుద్దీన్, ఆదం సోదరులు దర్గాలో హజరత్ ఇమాంషావలి సమాధిపై నూతన వస్త్రాలు, పూలచద్దర్‌లు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు చేయించారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులకు ఆకట్టుకుంది.

విమానాశ్రయానికి వాల్మీకి పేరుపై హర్షం

కంబదూరు: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం అయోధ్యలో అంతర్జాతీయ విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి ఎయిర్‌పోర్టుగా కేంద్ర ప్రభుత్వం పేరు మార్చుతున్నట్లు ప్రకటించడంపై వాల్మీకి సేవా సమితి తాలూకా అధ్యక్షుడు ములకనూరు గోవింద్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులు మీసేవ కుమార్, అమర్, రాజగోపాల్, రమేష్, రామాంజిలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అయోధ్య విమానాశ్రయానికి వాల్మీ మహర్షి పేరును పెట్టడం గర్వించదగ్గ విషయమన్నారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ కమిటీ ఎన్నిక

రాయదుర్గంటౌన్: ఎమ్మార్పీఎస్ రాయదుర్గం పట్టణ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని సెయింట్ థామస స్కూల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పట్టణాధ్యక్షుడిగా మనోహర్, ఉపాధ్యక్షుడిగా తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా యేసూఫ్, కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్, హరీష్, శివ, అంజనేయులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్నప్ప, రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షుడు వన్నూరుస్వామి, ఉపాధ్యక్షుడు గోవింద పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

బొమ్మనహాళ్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారులకు మండల వ్యాప్తంగా 15 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ షకీలాబేగం తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఇప్పటి వరకూ క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించామన్నారు. మండలస్థాయిలో క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రకారం దశలవారీగా పోటీలను నిర్వహిస్తామన్నారు. జనవరి 10న మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు.

వృద్ధురాలికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కుర్లపల్లి సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి వృద్ధురాలు మారెక్క తీవ్రంగా గాయపడింది. వివరాలు.. నారాయణపురం గ్రామానికి చెందిన మారెక్క ఆదివారం కుర్లపల్లిలో జరిగిన వివాహ వేడుకకు హాజరై మనవాడితో కలసి ద్విచక్రవాహనంలో బయలుదేరింది. కుర్లపల్లి గేట్ వద్ద కుక్క అడ్డం రావటంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ మారెక్కను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.